RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | సోమవారం 11 నవంబర్ 2024

సంపుటి: 2 | సంచిక: 182 | పేజీలు: 4 | వెల: రూ.5/-



## సుప్రీంకోర్టు సీజేఐగా సంజీవ్ ఖన్నా నేడు ప్రమాణ స్వీకారం

2లో..

# రైతుల రుణమాఫీ, 25 లక్షల ఉద్యోగాలు

## మహారాష్ట్ర ఎన్నికలు.. బీజేపీ మేనిఫెస్టో విడుదల




**మహారాష్ట్ర, (ప్రభాత సూర్యుడు):** మహారాష్ట్రలో అసెంబ్లీలో విజయం సాధించేందుకు మహాయుతి కూటమి తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఎన్నికలకు కొద్ది సమయం ఉండడంతో కూటమి, ఎన్నికల మేనిఫెస్టోని విడుదల చేసింది. ముఖ్యంగా రైతుల రుణమాఫీ గురించి తొలిసారి ప్రస్తావించింది. ఇంకా మేనిఫెస్టోలోని కొన్ని అంశాలు మీకోసం.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సమయం కొద్దిరోజులు మాత్రమే ఉంది. దీంతో అధికార బీజేపీ-మహాయుతి కూటమి తమ అస్త్రాలను బయటపెట్టింది. ఇందులోభాగంగా ఆదివారం కూటమి మేనిఫెస్టోని విడుదల చేశారు కేంద్ర హోంమంత్రి అమిత్ షా. ముంబై బీజేపీ కార్యాలయంలో కేంద్రమంత్రులు అమిత్ షా, పియూష్ గోయల్, డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌లు కూటమి సంకల్ప్ పత్ర పేరుతో విడుదల చేశారు. మహారాష్ట్రలో అధికారం నిలబెట్టుకోవడానికి తొలిసారి రైతు రుణమాఫీ అస్త్రాన్ని తెరపైకి తెచ్చింది బీజేపీ కూటమి. అన్నదాతలకు రుణమాఫీని ప్రకటించింది. ఇప్పటివరకు ఉన్న లడ్కీ బహిన్ యోజన కిందట ఇస్తున్న మొత్తాన్ని రూ. 1500 నుంచి రూ. 2,100 పెంచుతున్నట్లు పేర్కొంది. 11 లక్షల మంది మహిళలకు ఇస్తున్న లక్షపతి దీదీ పథకాన్ని, 50 లక్షల మందికి విస్తరించనుంది. వృద్ధులకు ఇస్తున్న రూ.1500 నుంచి రూ.2,100 పెంచుతున్నట్లు వెల్లడించింది. రాబోయే ఐదేళ్లలో యువతకు 25 లక్షల ఉద్యోగాలు ఇస్తామని సంకల్ప్ పత్ర పేరులో పేర్కొంది బీజేపీ కూటమి. పరిశ్రమలను ప్రోత్సహించే క్రమంలో రూ. 25 లక్షల వరకు సున్నా వడ్డీ రుణం ఇస్తామని తెలిపింది. ఎరువులపై జీఎస్టీ తిరిగి రైతులకు ఇస్తామని వెల్లడించింది. ఎంఎస్పీ కంటే తక్కువ పంటలు కొనుగోలు చేసిన రైతులకు బవంతర్ యోజన ద్వారా పరిహారం అందిస్తామన్నారు. ఓవరాల్‌గా కీలకమైన అంశాలపై ప్రధానంగా ఫోకస్ చేసింది. కూటమి అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో టెక్నాలజీ బలోపేతం కోసం విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేస్తామన్నది మరో కీలకమైన పాయింట్. ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా,

..మిగతా 2లో



# బీసీ డిక్లరేషన్ హామీలు ఏమయ్యాయి

### అడ్డగోలు హామీలు ఇచ్చి..ఇప్పుడు అధికారులను బలిపశువులను చేస్తున్నారు

### హన్మకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేటీఆర్

**హన్మకొండ, (ప్రభాత సూర్యుడు):** హన్మకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్‌లో స్వాగతం పలికిన జిల్లా కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. గత ఏడాది సరిగ్గా ఇదే రోజు కామారెడ్డి సభలో బి సి డిక్లరేషన్ ప్రకటించి ఏడాది పూర్తయిందని, బీసీ డిక్లరేషన్ హామీలు ఏమయ్యాయి ఒక్కటైనా హామీ చేసిందా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన అన్నారు. చేతి గుర్తుకు ఓటు వేస్తే చేతి వృత్తుల వాళ్లకు గొంతు కోసిన పాలన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం సాగుతోందని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్నో పథకాలు ఉండేది కులవృత్తులను బలోపేతం చేసేలాగా ఎన్నో పథకాలు తీసుకొచ్చావన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. బీసీ వర్గాలకు తీరని అన్యాయం చేస్తుందని, రేవంత్ రెడ్డి రాగానే బీసీ బంద్ బంద్ అయింది రైతుబంధు బంద్ అయిందన్నారు కేటీఆర్. బీసీల ఓట్ల కోసం ఇప్పుడు కులగనన అని కొత్త నినాదం ఎత్తుకున్నారని, సర్వే కోసం ఇంటికి వెళ్తే అధికారులను జనం


..మిగతా 2లో

# కాంగ్రెస్ వెబ్‌సైట్‌లో అబద్ధాలు

## హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు




**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** కాంగ్రెస్ పార్టీ అధికారిక వెబ్‌సైట్‌లో అబద్ధాలు పెట్టారని మాజీ మంత్రి హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. రుణమాఫీ చేస్తామని మాట తప్పారుని కీలక వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి తన అబద్ధాల ప్రవాహాన్ని మహారాష్ట్ర లో కొనసాగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీ లు ఇచ్చి అమలు చేయకుండా తెలంగాణ లో మోసం చేశారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రుణమాఫీ చేస్తాం అని చెప్పి మాట తప్పినం అని మహారాష్ట్ర లో చెప్పాల్సి ఉండే అన్నారు. మహారాష్ట్ర కు వెళ్లి అన్ని గ్లోబల్స్ ప్రచారం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారిక వెబ్సైట్ లో అబద్ధాలు పెట్టారని మండిపడ్డారు. మహాలక్ష్మి, రైతు భరోసా, రైతు కూలీలకు డబ్బులు, వరిపంట కు బోనస్, అమలు చేయట్లేదు అని చెప్పాల్సి ఉండే అన్నారు. తెలంగాణ లో అన్ని వర్గాలను రేవంత్ రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు. మేము మహారాష్ట్ర లో పోటీ చేయట్లేదన్నారు. అక్కడికి వెళ్లి ప్రచారం చేయమన్నారు. అందుకే ఇక్కడి నుండే కాంగ్రెస్ మోసాలపై చెబుతున్నామని క్లారిటీ ఇచ్చారు. రేవంత్ రెడ్డి మహారాష్ట్ర లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం కోసం తెలంగాణ డబ్బులు వాడుతున్నారని ఆరోపించారు. నిన్న జరిగిన మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రంలో రైతు వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ రైతు గర్జన కార్యక్రమం హరీష్ రావు తీవ్ర విమర్శలు చేసిన విషయం తెలిసిందే. మొద్దు నిద్ర పోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళు తెరవాలని కీలక వ్యాఖ్యలు చేశారు. రైతు బంధు, రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్ళ కోసం రైతు దీక్ష చేస్తున్నాం.. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తి చూపేందుకే రైతు దీక్ష చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో చెప్పని ఎన్నో పథకాలు రైతుల కోసం కేసీఆర్ పెట్టారు.. రైతుల సీఎం కేసీఆర్ అని ఇతర రాష్ట్రాల్లోనూ అన్నారని హరీష్ రావు తెలిపారు. భూతుల సీఎంగా రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచారు.. ఆరు గ్యారెంటీలు అమలు చేసిన అని మహారాష్ట్రలో రేవంత్ చెపుతున్నారు.. అందరిని మోసం చేసి మహారాష్ట్రలో అబద్దాలు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు.





# కురుమూర్తి స్వామి సేవలో సీఎం రేవంత్

## రూ.110 కోట్లతో ఆలయ ఘాట్ రోడ్డు పనులకు సీఎం శంకుస్థాపన

**మహబూబ్‌నగర్, (ప్రభాత సూర్యుడు):** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలం అమ్మాపురంలోని శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్ నుంచి అమ్మాపురం చేరుకున్న రేవంత్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు సీఎం రేవంత్‌కు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని బహుకరించారు. సీఎం రేవంత్ వెంట మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహా ఉన్నారు. దర్శనం కంటే ముందు.. కురుమూర్తి స్వామి దేవాలయానికి సమీపంలో రూ. 110 కోట్లతో చేపట్టనున్న ఆలయ ఘాట్ రోడ్, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. మంత్రులతో కలిసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఏడుకొండల మధ్యలో ఉన్న కాంచనగుహలో కొలువుదీరిన కురుమూర్తి ఆలయానికి చేరుకునేందుకు ప్రస్తుతం సరైన రోడ్డు మార్గం లేదు. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో.. కురుమూర్తి ఆలయానికి ఘాట్ రోడ్డు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెండ్రోజుల క్రితం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.110 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు కూడా

..మిగతా 2లో

# క్రోని క్యాపిటల్స్ నుంచి జార్ఖండ్‌ను రక్షించండి

## దేశంలోని విలువైన వనరులన్నీ వారికోసమే.. భట్టి షాకింగ్ కామెంట్లు



**రాంఘర్, (ప్రభాత సూర్యుడు):** అదానీ, అంబానీ వంటి కొద్దిమంది క్రోనీ క్యాపిటలిస్ట్ నుంచి జార్కండ్‌కు విముక్తి కల్పించండి. ఇండియా కూటమి అభ్యర్థులను తాజా ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఏఐసీసీ సీనియర్ పరిశీలకుడు, స్టార్ క్యాంపెయినర్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం జార్కండ్ రాష్ట్రం రాంఘర్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ మీటింగ్‌లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలకు ఆయన దిశా నిర్దేశం చేశారు. చిత్తార్పూర్ సీ,డీ బ్లాక్ రాజరప్ప బహిరంగ సభలో ముఖ్య అతిథిగా

..మిగతా 2లో

# ప్రజా విజయోత్సవాలు కాదు.. ప్రజా వంచన ఉత్సవాలు చేసుకోండి

## కాంగ్రెస్ ప్రభుత్వంపై బండి సంజయ్ సెటైర్లు



**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** ఆరు గ్యారంటీలు అమలు చేశారని విజయోత్సవాలు చేసుకుంటున్నారా? నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు, మహిళలకు తులం బంగారం, స్కూటీ, నెలనెలా రూ.2500లు ఇచ్చారని విజయోత్సవాలు చేసుకుంటారా? వృద్దులకు రూ.4 వేల ఆసరా పెన్షన్ ఇచ్చారని చేసుకుంటారా? పేదలకు ఇండ్లు ఇచ్చారని చేసుకుంటారా? దేనికోసం

..మిగతా 2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# జహీరాబాద్ హైవేపై భారీ అగ్నిప్రమాదం

### ఎనిమిది కార్లు దగ్ధం

**సంగారెడ్డి, (ప్రభాత సూర్యుడు):** సంగారెడ్డి జిల్లా జహిరాబాద్‌లోని హైవేపై (భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కార్లు తరలిస్తున్న కంటైనర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఎనిమిది కార్లు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పుతున్నారు. ముంబై నుంచి హైదరాబాద్ వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో ముంబై-హైదరబాద్‌పై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేసే ప్రయత్నం చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ప్రజా విజయోత్సవాలు కాదు..

# ప్రజా వంచన ఉత్సవాలు చేసుకోండి

మొదటి పేజీ తరువాయి...

విజయోత్సవాలు అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బండి సంజయ్ ప్రశ్నించారు. అవన్నీ ఇచ్చాక ఉత్సవాలు చేసుకోవాలని హితవు పలికారు. ఇప్పుడు మీరు చేసుకోవాల్సింది విజయోత్సవాలు కాదు%ౌ% నమ్మించి ప్రజలను మోసం చేసిందుకు 'ప్రజా వంచన' ఉత్సవాలు చేసుకోండని ధ్వజమెత్తారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టు వద్ద బీజేపీ నాయకులతో కలిసి కొనుగోలు కేంద్రాలను బండి సంజయ్ సందర్శించారు. వడ్ల కొనుగోలులో రైతులు పడుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బోనస్ పైసలివ్వకుండా తప్పించుకోవడానికి వడ్ల కొనుగోలు చేయకుండా జాప్యం చేస్తోందని మండిపడ్డారు. బ్రోకర్ల నుంచి కమీషన్లు దండుకునేందుకు రాష్ట్ర రైతుల ప్రయోజనాలను బలి పెడుతున్నారని ధ్వజమెత్తారు. వడ్ల పైసలన్నీ మిత్తీతో సహా కేంద్రమే చెల్లిస్తోందని.. అయినప్పటికీ వడ్లు కొనివ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చిన నొప్పి ఏందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులకు కనీస మద్దతు ధర దక్కలేదని.. బోనస్ రాలేదని బండి సంజయ్ అన్నారు. పైగా తాలు, తరుగు, తేమ పేరుతో నష్టం జరిగిందన్నారు. ఇక మీరు రైతులను ఆదుకున్నదెక్కడ అని ప్రశ్నించారు. ఇదేనా రైతు ప్రభుత్వమంటే%ౌ% ఇదేనా ఇందిరమ్మ పాలన అని మండిపడ్డారు. రైతులను అరిగోసపెట్టి దోచుకోవడమేనా కాంగ్రెస్ పాలనంటే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 95 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు పండిస్తే%ౌ% బహిరంగ మార్కెట్ అవసరాలకు 40 లక్షల వడ్లు పోతే, మిగిలిన 55 లక్షల మెట్రిక్ టన్నుల వడ్ల కొనుగోలుకు సంబంధించి పైసలన్నీ చెల్లించేందుకు కూడా కేంద్రం సిద్ధంగా ఉందని తెలిపారు. చివరకు వడ్ల కొనుగోలు కోసం రాష్ట్ర ప్రభుత్వం బయట నుంచి అప్పు తీసుకుంటే%ౌ% ఆ డబ్బులకు వడ్డీ కూడా కేంద్రమే చెల్లిస్తోందని.. అయినా ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏం మాయరోగం అని నిలదీశారు. ఎందుకు సకాలంలో వడ్లు కొనకుండా రైతులను అరిగోస పెడుతోందని ప్రశ్నించారు. సకాలంలో వడ్లు కొంటే బోనస్ ఇయ్యాలి. దానికి 2,500 కోట్లు కావాలి. ఇంతా చేస్తే మిగిలేదేమీ ఉండదు. అలా కాకుండా కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వడ్లను బ్రోకర్లు కొనేదాకా ఎదురు చూస్తే కోట్లకు కోట్లు కమీషన్లు దండుకోవచ్చు%ౌ% బోనస్ భారం నుంచి తగ్గించుకోవచ్చు%ౌ% ఇదీ కాంగ్రెస్ కుట్ర అని బయటపెట్టారు. బోనస్ ఇవ్వకుండా తప్పించుకోవడానికి, కమీషన్లు దండుకోవడానికి రైతుల ప్రయోజనాలను బలి పెడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు వడ్లన్నీ కొనాల్సిందేనని.. బోనస్ చెల్లించాల్సిందేనని డిమాండ్ చేశారు.



## రైతుల రుణమాఫీ,

# 25 లక్షల ఉద్యోగాలు

మొదటి పేజీ తరువాయి...

బీజేపీకి అసలైన పోటీ మహా వికాస్ అఘాడీతోనని పునరుద్ఘాటించారు. తమ మేనిఫెస్టో మహారాష్ట్ర ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబి స్తాయన్నారు. రైతులను గౌరవించడం, మహిళలకు ఆర్థికంగా పైకి తీసుకురావా లన్నదే తమ ధ్యేయమని నొక్కి వక్కానించారు. ఉద్దవ్ థాక్రేని ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. వీర్ సావర్కర్ గురించి సానుకూలంగా మాట్లాడేలా రాహుల్ గాంధీని ఒప్పిస్తారా? బాలాసాహెబ్ థాక్రే గురించి కాంగ్రెస్ నాయకుడ్ని మెచ్చుకు నే చెబుతారా అంటూ హిస్టరీని తెరపైకి తెచ్చే ప్రయత్నం చేశారాయన. నవంబర్ 6న మహారాష్ట్ర ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది కాంగ్రెస్. ఇరు పార్టీల మధ్య మేనిఫెస్టో విడుదల కావడంతో రెండు కూటముల మధ్య మాటల యుద్ధం పెరిగే అవకాశముంది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 20న జరగనున్నా యి. మొత్తం 288 నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు నవంబర్ 23న జరగనుంది.

# క్రోని క్యాపిటల్స్ నుంచి జార్కండ్‌ను రక్షించండి

మొదటి పేజీ తరువాయి...

పాల్గొన్న సందర్భంగా జార్కండ్ ప్రజల పోరాట స్ఫూర్తిని కొనియాడారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ జార్కండ్ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన ఏఐసీసీ నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మల్లిఖార్జున ఖర్గే నాయకత్వం లో రాహుల్ గాంధీ కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా చేసిన జోడో యాత్ర తో దేశం లో ప్రజాస్వామిక శక్తులను ఏకం చేశారని అన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ రెండు సందేశాలు ఈ దేశానికి ఇచ్చారని వివరించారు. విద్వేషాలను రగిలించే వారి చేతిలో ఈ దేశాన్ని పెట్టేందుకు మేము సిద్ధంగా లేము, విశాల భారతదేశంలో ప్రేమ అనే దుకాణం తెరిచి అన్ని జాతులు, మతాలకు సమాన అవకాశాలు ఇస్తామని సందేశం ఇచ్చారని వివరించారు. అదే సందర్భంలో ఈ దేశంలోని వనరులు, సంపద, ప్రభుత్వ రంగ సంస్థలు ఈ దేశ ప్రజలకే చెందాలి తప్ప కొద్ది మంది క్రోనీ క్యాపిటల్ లిస్ట్ ల చేతిలో పెట్టేందుకు సిద్ధంగా లేమని సందేశం ఇచ్చారని తెలిపారు. అదాని, అంబానీ వంటి క్రోనీ క్యాపిటల్ లిస్ట్ ఈ దేశాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ పెద్ద పోరాటం చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపిస్తేనే జార్కండ్ వనరులు రక్షించబడతాయని అన్నారు. ఈ దేశ సంపద జనాభా నిష్పత్తికి అనుగుణంగా పంపిణీ జరగాలి అంటే రాజ్యాంగాన్ని రక్షించుకొని ముందుకు పోవాలి అందుకు ఇండియా కూటమి అభ్యర్థుల ను గెలిపించడమే మన ముందు ఉన్న లక్ష్యం అని తెలిపారు. కొద్దిమంది పెట్టుబడిదారుల చేతుల్లో జార్కండ్ రాష్ట్రాన్ని పెట్టేందుకు బిజెపి ప్రయత్నిస్తుందని చైతన్యం గల కాంగ్రెస్ కార్యకర్తలు జార్కండ్ రాష్టాన్ని, ఇక్కడి వనరులను ఆ దోపిడీ దారుల నుండి కాపాడు కోవాల్సిందిగా పిలుపు నిచ్చారు. జార్కండ్ ప్రజలు డబ్బుకు లొంగి పోయే రకం కాదని వాళ్ళకి వివేచన, విచక్షణ ఉందనీ ఆ పరంపరను కాపాడాల్సిందిగా పిలుపు నిచ్చారు. బ్లాక్, గ్రామ కాంగ్రెస్, పోలింగ్ బూత్ అధ్యక్షులు సమావేశమై విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఇండియా కూటమి ఇస్తున్న హామీలు, మేనిఫెస్టోను ఓటర్లకు పెద్ద ఎత్తున వివరించాలని, విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. రాంఘర్ అభ్యర్థి మమతా దేవిని భారీ మెజార్టీతో గెలిపించాలని, అలాగే కూటమి అభ్యర్థులను అందరినీ గెలిపించాలన్నారు. ఈ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు ఏఐసీసీ నాయకులు గులాం అహమద్ మీర్ ,ఏఐసీసీ సెక్రటరీ సిరివెళ్ల ప్రసాద్, జార్కండ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్ కేశవ్ కమలేష్ మహతో, షహ్ నాజ్ అన్వర్ , మైనారిటీ సెల్ అధ్యక్షులు తారీక్ అన్వర్ ,షకీల్ అహ్మద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, , స్థానిక నియోజక వర్గ నాయకులు, మండల ,గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు.



## బీసీ డిక్లరేషన్

# హామీలు ఏమయ్యాయి

మొదటి పేజీ తరువాయి...

నిలదీస్తున్నారన్నారు కేటీఆర్. అంతేకాకుండా%ౌ%'బీసీలకు సబ్ ప్లాన్ అని చెప్పావ్ ఒకటన్న అమలు అయ్యాయా. కుల గణన కోసం కావాలంటే ఆ ప్రశ్నలను తగ్గించండి. కేవలం కులాలకు సంబంధించిన సమాచారం మాత్రమే తీసుకోండి. ఆర్థిక అంశాలను ఆ ఫార్ములా నుంచి తొలగించండి. కులగర్ల కోసం చేస్తే కులాలకు సంబంధించిన వివరాలు సేకరించేలాగా ఫామ్ రూపొందించండి. కుల గణన చేసిన 42% రిజర్వేషన్లు అమలు అయ్యేలాగా చేయండి. మా ఎమ్మెల్యేల మీద దాడులు చేయడం కాదు ఇచ్చిన మాటను మీద నిలబెట్టుకో. ఇదే వరంగల్లో రైతుల డిక్లరేషన్ ప్రకటించారు. ఏ మార్కెట్ పోదాం రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదు. రాష్ట్రంలో రైతులకు 500 రూపాయల బోనస్ ఇస్తున్నట్లు మహారాష్ట్రలో ఈ ముఖ్యమంత్రి బోగస్ మాటలు చెబుతున్నాడు. రైతులకు బోనస్ ఎక్కడ ఇచ్చావు ఒక్కచోటన్న ఇచ్చావా చూపిస్తావా ఏ మార్కెట్ పోదాం. నువ్వు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే వరకు నిలదీస్తూనే ఉంటాం నిన్ను వెంటాడుతూనే ఉంటాం. కేసులు పెట్టుకున్న పాసులు పెట్టుకున్న భయపడేది లేదు. కులగణనాలో అధికారులను నిలదీయండి.. అడగండి%ౌ% దీని వివరాలు దేనికి ఎందుకు అని అడగండి. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అడగండి.. 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతనే ఈ వివరాలు తీసుకోండని జనం నిలదీయండి.. నిలదీయండి వివరాలు రాయించుకోండి. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు మీరు అమలు చేస్తారని కుల గణన కోసం వస్తున్న అధికారులను రాసి ఇవ్వమని అడగండి నిలదీయండి. బాంబుల శాఖ మంత్రి గురించి మీరు అడుగుతున్నాయి.. ఆయనకు బాంబుల శాఖ అని పేరు పెట్టండి.. వాళ్లని మాత్రం వదిలిపెట్టడం కచ్చితంగా నిలదీస్తాం.. విజయోత్సవాలు చేయాలా వారవోత్సవాలు చేయాలనేది మేము నిర్ణయిస్తాం.. డిసెంబర్ 9 కి ఏడాది పూర్తయిన నేపథ్యంలో వాళ్లు ఎలా వైఫల్యం చెందారో మేము కూడా అన్ని వివరాలు సేకరించి వైఫల్య వారోత్సవాలను నిర్వహిస్తాం..' అని కేటీఆర్ అన్నారు.

# నగరంలో కొత్త టెండర్లు తీసుకునే పరిస్థితి లేదు

### కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు):** నగరంలో కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వని కారణంగా కొత్త టెండర్లు తీసుకునే పరిస్థితి లేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్‌లోని డి-క్లాస్‌లో కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించిన అనంతరం ఆసిఫ్‌నగర్ డివిజన్‌లోని దయాబాగ్‌లో G01 కమ్యూనిటీ హాల్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తున్నామన్నారు. గత అనేక సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో శాసన సభ్యులు గా, కార్పొరేటర్లుగా మజ్లిస్ పార్టీ నేతృత్వం వహిస్తుంద న్నారు. మజ్లిసేతర ప్రాంతాల్లో ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం కూడా ప్రజలకు అందకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండపడ్డారు. మజ్లిస్ కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు పక్షపాతంతో వ్యవహరిస్తూ ఇక్కడి ప్రజలకు అన్యాయం చేస్తున్నారు. పార్లమెంటు సభ్యుడిగా బాధ్యతగా నాంపల్లి నియోజకవర్గ ప్రజలకు మేలు చేసేలా అనేక పనులు చేస్తున్నామన్నారు. నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ డిపార్ట్ మెంట్ల సాయంతో సుమారు రూ. 78 లక్షలతో కమ్యూనిటీ హాళ్లు, ఓపెన్ జిమ్స్, బోర్ వెల్స్.. ఇలా అనేక సౌకర్యాలు కల్పించేలా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. బస్తీ నాయకులు, ప్రజలు రాజకీయాలకు అతీతంగా ముందుకురావాలన్నారు. హైదరాబాద్ నగరంలో జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ డిపార్ట్ మెంటుకు నిధుల కొరత వేధిస్తుందన్నారు. కనీసం వీధి లైట్లు హ్యాండిల్ చేసే సిబ్బందికి కూడా జీతాలివ్వడం లేదు. దీంతో సమ్మెకు దిగారన్నారు. హైదరాబాద్ నగరంలో కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వని కారణంగా కొత్త టెండర్లు తీసుకునే పరిస్థితి లేదన్నారు. నగరంలో అంబర్ పేట్, ఖైరతాబాద్, సికింద్రాబాద్, నాంపల్లి, గోషామహల్ వంటి ప్రాంతాల్లోని బస్తీల్లో నిధుల కొరతతో ప్రజలకు అన్యాయం జరుగుతుందని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ డిపార్ట్ మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్లకు నిధుల కొరతతో అరకొర సౌకర్యాలతో పాఠశాలలు నడుస్తున్నాయని తెలిపారు. నిధుల కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలన్నారు.



# కురుమూర్తి స్వామి సేవలో సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి...

జారీ చేసింది. దీంతో నేడు ఆలయానికి వచ్చిన సీఎం రేవంత్ పనులు ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడిన సీఎం రేవంత్.. కురుమూర్తి స్వామి దయతోనే తాను సీఎం అయినట్లు చెప్పారు. ఈ జిల్లా నుంచి 12 మంది ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ, ఒక సీఎం ఉన్నారని.. జిల్లాను విశేషంగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లా ప్రజలకు అన్ని మౌళిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

**వైభవంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు..**

తెలంగాణలో అత్యంత వైభవంగా జరిగే జాతరలలో కురుమూర్తి జాతర కూడా ఒకటి. పేదల తిరుపతిగా కురుమూర్తి ఆలయాన్ని పిలుస్తుంటారు. ప్రస్తుతం కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం (నవంబర్ 9) తెల్లవారుజామున ఉత్సవమూర్తులను పుష్కరిణి వరకు ఊరేగింపుగా తీసుకొచ్చిన అర్చకులు శాస్త్రోక్తంగా చక్రస్నానం పూర్తి చేసి సప్త వాహన సేవలు నిర్వహించారు. అనంతరం భక్తులు పుష్కరిణిలో స్నానాలు చేసి ఉద్దాల మండపంలో పాదుకల ఆశీర్వాదం తీసుకొన్నారు. ఆ తర్వాత కురుమూర్తిస్వామితో పాటు లక్ష్మీదేవి, చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామిలను దర్శించుకొని మ్నెక్కులు చెల్లించుకున్నారు. కొండ దిగువన మట్టి కుండలో నైవేద్యం వండి దాసంగాలు సమర్పించారు. ఉ త్సవానికి వచ్చిన భక్తులు, యాత్రికులు జాతర మైదానంలో రాత్రి బసకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# సుప్రీంకోర్టు సీజేఐగా సంజీవ్ ఖన్నా నేడు ప్రమాణ స్వీకారం

**న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు):** సుప్రీంకోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం ప్రమాణం చేస్తారు. జస్టిస్ సంజీవ్ ఖన్నాతో రాష్ట్రపతి ద్రౌపది ముర్మ సోమవారం ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ప్రస్తుత చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీ కాలం ఆదివారంతో ముగుస్తున్నది. ఆయన స్థానంలో సుప్రీంకోర్టు సీజేఐగా ఎంపికైన జస్టిస్ సంజీవ్ ఖన్నా 2019 జనవరి నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందిస్తున్నారు. 2025 మే రెండో వారం వరకూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సంజీవ్ ఖన్నా వ్యవహరిస్తారు. ఖన్నా కుటుంబ సభ్యుల నుంచి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన సంజీవ్ ఖన్నా మూడో వ్యక్తి. అంతకు ముందు ఢిల్లీ హైకోర్టు జడ్జిగా పని చేసిన దేవీరాజ్ ఖన్నా కొడుకే సంజీవ్ ఖన్నా. సుప్రీంకోర్టు జస్టిస్ హెచ్ఆర్ ఖన్నాకు సమీప బంధువు. జస్టిస్ సంజీవ్ ఖన్నా పలు చారిత్రక తీర్పులు ఇచ్చిన వారిలో ఒకరు. ఈవీఎంల పవిత్రతతోపాటు ఎన్నికల బాండ్ల రద్దు, 370 ఆర్టికల్ రద్దు, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ వంటి కేసుల్లో తీర్పులు ఇచ్చారు. 1960 మే 14న జన్మించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా.. ఢిల్లీ యూనివర్సిటీలో న్యాయవిద్యను అభ్యసించారు. నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ (ఎన్ఏఎల్ఎస్ఏ) ఎగ్జిక్యూటివ్ చైర్మన్ గా పని చేశారు. 1983లలో న్యాయవాదిగా ఢిల్లీ బార్ కౌన్సిల్ లో పేరు రిజిస్టర్ చేసుకున్నారు. తొలుత తీస్ హజారీ కాంప్లెక్సులోని జిల్లా కోర్టుల్లో న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. సుదీర్ఘకాలం ఆదాయం పన్ను విభాగం సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్ గా కొనసాగిన సంజీవ్ ఖన్నా.. 2004లో ఢిల్లీ నేషనల్ క్యాపిటల్ టెర్రిటరీ స్టాండింగ్ కౌన్సిల్ (సివిల్)గా నియమితులయ్యారు. 2005లో ఢిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులైన సంజీవ్ ఖన్నా.. తదుపరి ఏడాది శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ప్రమోషన్ పొందారు.

ఇక సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా వైదొలుగుతున్న డీవై చంద్రచూడ్ శుక్రవారం నలుగురు న్యాయమూర్తుల బెంచ్ కు సారథ్యం వహించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎనిమిదేండ్ల చరిత్రలో రికార్డు స్థాయిలో 38 రాజ్యాంగ ధర్మాసనాలు ఏర్పాటు చేశారు. గత రెండేండ్లుగా 21,358 కేసుల్లో బెయిల్ తోపాటు 1.07 లక్షల కేసులను పరిష్కరించారు. చివరి పనిదినం శుక్రవారం తన కెరీర్ లో చేపట్టిన విషయాలను వెల్లడించారు. జస్టిస్ చంద్రచూడ్ సేవలను సీజేఐగా ఎంపికైన జస్టిస్ రాజీవ్ కన్నా, అటార్నీ జర్నల్, సొలిసిటర్ జర్నల్, సుప్రీంకోర్ట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కపిల్ సిబాల్ ప్రశంసించారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతా వరణం ఏర్పడిందని, అది దేశంలో ఎక్కడా లేనంత సులభతర వాణిజ్య విధానాల ద్వారా సాధ్యమైందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. మలేషియా రాష్ట్రం కౌలాలంపూర్‌లో ఆదివారం జరిగిన తెలంగాణా దశాబ్ది ఉత్సవాలలో పాల్గొనడం ద్వారా, మలేషియా పారిశ్రామిక వేత్తలతో సమావేశం ఏర్పాటు చేసిన శ్రీధర్ బాబు, తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి తాము వారికి ఆహ్వానాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, మలేషియా-భారత్ మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడాలని, రెండు దేశాల సంస్కృతుల్లో అనేక సారూప్యతలు ఉన్నందున పరస్పర సహకారం సులభంగా జరగవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. మలేషియా పారిశ్రామిక వేత్తలకు డిసెంబరులో తెలంగాణ సందర్శన కోసం ఏర్పాట్లు చేస్తున్నామని కూడా ఆయన పేర్కొన్నారు. అలాగే, తన రాజకీయ ప్రస్థానం 25 సంవత్సరాలను పూర్తి చేసుకున్న సందర్భంలో, తనను ఆదరించిన మిత్రులు, సహచరులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన శ్రీధర్ బాబు, ఈ సందర్భంగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గే వంటి నేతల ద్వారా ఎన్నో ప్రోత్సాహాలు, ప్రాధాన్యతలు పొందిందని చెప్పారు. మంత్రిగా పనిచేసిన నలుగురు ముఖ్యమంత్రుల నుంచి కూడా అనేక ప్రోత్సాహాలు, ఆదరాభిమానాలు పొందినట్లు తెలిపారు.

# నాగార్జున సాగర్ నుండి శ్రీశైలం నదీ యాత్ర

## అద్వితీయం- అద్భుతం- ఆహ్లాదకరము

### 112 మైళ్ళ, 6 గంటల నీటి ప్రవాహంలో నల్లమల అటవీ అందాలను చూస్తూ బోటు ప్రయాణం చేయాల్సిందే!

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): నంది కొండ కృష్ణానది లో పురాతన నాగార్జున కొండ!!! బౌద్ధ ఆరామము, బౌద్ధ ఆచార్యుడు నాగార్జునుడు నడి ఆడిన పవిత్ర ప్రాంతం. ఆయుర్వేద వైద్య శాస్త్ర చరిత్రలో చరిత్ర సృష్టించిన ప్రాంతం, ప్రపంచానికి బౌద్ధం పరిచయం చేసిన ప్రాంతం. నందికొండ లో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన ప్రాంతం, గౌతమ బుద్ధుడి బోధనలను, బౌద్ధ శిక్షణ తరగతులను సంస్కృత వేదముల, వేద పాఠశాలలను, వేద విద్యాలయం, బుద్ధుని బోధనల సంస్కృత వేద పాఠశాల ప్రబోధించిన ప్రాంతం. ఆచార్య నాగార్జునుడి విశ్వవిద్యాలయం, భారత సంస్కృతికి, సంస్కృత భాష కు వేద పండితుల బుద్ధుని బోధనలకు పుట్టినిల్లు నాగార్జున కొండ. అదే నందికొండ. కాలక్రమేణ ఆచార్య నాగార్జునడి పేరుతో ప్రస్తుతం నాగార్జునసాగర్ గా నల్లగొండ జిల్లాలో విరాజిల్లుతున్నది. అసలు విషయానికి వస్తే నదీ బోటు ప్రయాణం లో కొన్ని గంటలు విహరించాలన్నా,


నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం కృష్ణ నదిలో బోటు ప్రయాణం


నందికొండ నుంచే బుద్ధుడి బోధనలు ప్రపంచానికి తెలిసింది

చూడాలన్నా, ఆనందించాలన్నా, పారే కృష్ణ నది బోటు ప్రయాణం మరుపు రాని, మరువలేని మధు రానుభూతి తెలంగాణ టూరిజం శాఖ తాజాగా కల్పించింది. నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం బోటు నది యాత్ర మహాద్భుతం. కృష్ణ నదీ నల్లమల అటవీ ప్రాంతం చుట్టు బోటు ప్రయాణం 112 మైళ్ళు, 6 గంటల నదీ యాత్ర తెలంగాణ నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ కృష్ణ నది నుంచి శ్రీశైలం మల్లన్న స్వామి దేవాలయం వరకు కృష్ణా నదిలో బోటు ప్రయాణం చేయాల్సిందే!!! తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నాగార్జునసాగర్ నుండి శ్రీశైలం వరకు 6 గంటల కృష్ణానది లో విహార నదీ బోటు ప్రయాణం తెలంగాణ రాష్ట్ర టూరిజం శాఖ ఆధ్వర్యంలో కృష్ణా నది విహారయాత్ర ను ప్రారంభించినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని మనసారా ఆశీర్వదించాల్సిందే!!!! ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో తెలంగాణ ప్రాంత చారిత్రక ప్రాంతాలకు వివక్షత తో

**ప్రభాత సూర్యుడు దినపత్రిక చీఫ్ ఎడిటర్ కస్బా శంకర్రావు నది బోటు యాత్ర వ్యాసం**

ఆదరణ లేక వెళ వెళ పోయిన దుస్థితి నుంచి, ఇప్పుడిప్పుడే తెలంగాణ రాష్ట్ర టూరిజం శాఖ ఈ మధ్యలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం వరకు కృష్ణ నది బోటు విహారయాత్ర 112 కిలోమీటర్ల మేరా, 6 గంటల ప్రయాణాన్ని పర్యాటకులకు అందుబాటులో తెచ్చినందుకు తెలంగాణ ప్రభుత్వాన్ని మెచ్చుకోక తప్పదు. విహార బోటు నది ప్రయాణం చేయాలంటే, నాగార్జున సాగర్ సోమశిల నుంచి శ్రీశైలం మల్లికార్జునుడి చెంతకు బోటు ప్రయాణం చేయాల్సిందే. ఇంత చారిత్రాత్మక పర్యాటక విహార బోటు యాత్రను ప్రభుత్వం ఇంకా ప్రచారం చేయవలసిన అవసరం ఉన్నది. గతంలో బోటు ప్రమాదాలు జరిగి చాలా ప్రాణ నష్టం జరిగిన విషయం తెలిసిందే, విహార పర్యాటకులకు తగినంత సేఫ్టీ ఇస్తూ పర్యాటక ప్రజలను తగిన రీతిలో బోటు ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. టూరిజం శాఖ, ప్రభుత్వం పై ఆధారపడి ఉన్నది. ఏది ఏమైనా నాగార్జున సాగర్ నది బోటు యాత్రను అందరమూ ఆహ్వానించాల్సిందే !!!



# ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పసుమర్తి చందర్రావుని సత్కరించిన జగ్గయ్యపేట నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీరామ్ తాతయ్య

కల్లూరు -ప్రభాత సూర్యుడు ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతనంగా ఎన్నికైనటువంటి అధ్యక్షులు శ్రీ పసుమర్తి చందర్రావు ఖమ్మం జిల్లాలో జరిగిన కార్తీక వన సమారాధన కార్యక్రమాలు పలు మండలాల్లో జరిగిన సందర్భంగా జిల్లాలోని నేలకొండపల్లి, బోనకల్లు, మధిర, కల్లూరు, సత్తుపల్లి మండలాల్లో విస్తృత పర్యటన చేయడం జరిగింది. నేలకొండపల్లి వనసమారాధన కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దోసపాటి చంద్రశేఖర్, పట్టణ సంఘం అధ్యక్షులు రేగూరి హనుమంతరావు, మరియు జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ తాతయ్య పసుమర్తి చందర్రావును ఘనంగా సత్కరించడం జరిగింది. అంతేకాకుండా బోనకల్లు వన సమారాధన కార్యక్రమంలో బోనకల్ మండల అధ్యక్షులు చేదే వెంకటేశ్వరరావు, మధిర వన సమారాధన కార్యక్రమంలో మధిర మండల అధ్యక్షులు చారుగుండ్ల నరసింహమూర్తి, పట్టణ అధ్యక్షులు వనమా కిరణ్ కుమార్, కల్లూరు వన సమారాధన కార్యక్రమంలో కల్లూరు మండల అధ్యక్షులు అనుమోలు శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు చలువాది నగేష్, సత్తుపల్లి వనసమారాధన కార్యక్రమంలో మండల అధ్యక్షులు వందనపు సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు సోమిశెట్టి శ్రీధర్ మరియు పలు ఆర్యవైశ్య ప్రముఖులు ఘనంగా సత్కరించి సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పసుమర్తి చందర్రావు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల ఆర్యవైశ్య సంఘాల బలోపేతానికి కృషి చేస్తానని, సభ్యత్వ పెంపు నమోదు కార్యక్రమం చేపడతామని, బీద ఆర్యవైశ్యులకు అండగా ఉంటానని పేర్కొనడం జరిగింది.



# యాదగిరిగుట్టకు పోటెత్తిన జనం

## దర్శనానికి 3 గంటల సమయం



యాదాద్రి, (ప్రభాత సూర్యుడు): యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. స్వామివారి దర్శనం కోసం భారీగా క్యూ లైన్ లలో భక్తులు వేచి ఉన్నారు. స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం పడుతుండటంతో భక్తులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. కార్తీక మాసం సందర్భంగా భక్తులు విశేష సంఖ్యలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించుకుంటున్నారు. కార్తీక మాసం, దానికి తోడు ఆదివారం సెలవుదినం కావడంతో ఇష్టదైవాలయ దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో క్షేత్రాలకు చేరుకుంటున్నారు. పార్కింగ్ స్థలం వాహనాలతో నిండిపోయి, మైదానం చుట్టూ ఉన్న రింగ్ రోడ్డుపై కూడా వాహనాలు నిలిచిపోయాయి. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సత్యదేవుని వ్రతం, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దీపారాధనలు భక్తులతో కిటకిటలాడాయి. కొండపైనున్న గర్భగుడి వద్ద పంచనారసింహుని సమేతంగా రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కాగా ప్రధాన ఆలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, శివాలయం, ప్రసాద వెండశాల, కొండకింద వ్రత మండపం, లక్ష్మీ పుష్కరిణి, అన్నదాన సత్రం, కళ్యాణ కట్ట తదితర ప్రాంగణాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయానికి ఉత్తర దిశలో చిత్రపటాలు చేసేందుకు భక్తులు పోటీ పడ్డారు. అదేవిధంగా భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకస్వాములు స్వయంభువులకు సంప్రదాయబద్ధంగా నిత్యపూజలు నిర్వహించారు. కొండపై ఉన్న శివాలయంలో శ్రీరామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శివగామరితితో పాటు శ్రీ పర్వతవర్ధిని నిర్వహించారు. మరోవైపు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా భక్తుల రద్దీ నెలకుంది. ఆలయం ముందు భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. స్వామివారి దర్శనానికి నాలుగు గంటల సమయం పడుతుండటంతో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఈరోజు రేపు గర్భాశయంలో భక్తులచే నిర్వహించే ఆర్జిత సేవలను ఆలయ అధికారులు రద్దు చేశారు.



# నేతన్న కుటుంబానికి కేటీఆర్ భరోసా

## పిల్లల చదువుకయ్యే ఖర్చు మొత్తం భరిస్తానని హామీ

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): సిరిసిల్లలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న నేతన్న బైరి అమర్ దంపతుల కుటుంబసభ్యులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. ఆదివారం సాయంత్రం సిరిసిల్లకు చేరుకున్న కేటీఆర్.. వెంకంపేటలోని బైరి అమర్- స్రవంతి కుటుంబసభ్యులను ఓదార్చారు. వారి పిల్లల చదువుకు అయ్యే ఖర్చు మొత్తం తానే భరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే ముగ్గురు పిల్లలకు ఒక్కొక్కరికి రూ. 2లక్షల చొప్పున డిపాజిట్ చేయిస్తానని తెలిపారు. ధైర్యంగా ఉండాలని.. బాగా చదువుకోవాలని ఈ సందర్భంగా బైరి అమర్ పిల్లలకు కేటీఆర్ సూచించారు. అమర్ పిల్లలకు ప్రభుత్వం తరఫున అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ఫోన్‌లో తెలిపారు. బాధిత కుటుంబానికి 10 లక్షల రూపాయల వరకు పరిహారాన్ని అందించవలసిందిగా కోరారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. సిరిసిల్లలో ఇప్పటివరకు 20 మంది నేతన్నలు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పొడిచిన వెన్నుపోటు వల్ల మాత్రమే నేతన్నల ఆత్మహత్యల పరంపర కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలన్నిటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల నుంచి తాను ఎమ్మెల్యేగా ఉండటం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇబ్బంది కలిగితే తక్షణమే రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ తెలిపారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను సంక్షోభంలోకి నెట్టే విధంగా కక్ష పెట్టడం ప్రభుత్వానికి మంచిది కాదని హితవు పలికారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుని మానవత్వంతో స్పందించాలని కోరారు. సిరిసిల్లకు న్యాయం చేసేదాకా ఈ ప్రభుత్వాన్ని వదిలిపెట్టమని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా సిరిసిల్లలో ఒక కుటుంబాన్ని లేదా కొన్ని కుటుంబాలను మాత్రమే నేను ఆదుకోగలుగుతానని అన్ని కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని అన్నారు.



# సిపిఐ 100 సం.ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలి

చిలుకూరు (ప్రభాత సూర్యుడు) భారత కమ్యూనిస్టు పార్టీ 100 సం,లు 2024 డిసెంబర్ 26 నాటికి 100 సం,లు అడిగిడుతున్న సందర్భంగా ఎంతో ఘనమైన చరిత్ర కలిగి స్వాతంత్ర ఉద్యమంలో ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని దేశవ్యాప్తంగా ప్రజా సంఘాలను నిర్మాణం చేసుకొని ప్రాణ త్యాగాలు చేసిన పార్టీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులను కోరారు. ఈరోజు చిలుకూరు మండలం కౌన్సిల్ సమావేశం డి ఎన్ భవన్లో చేవూరు కొండలు అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ చిలుకూరు మండలంలో పార్టీ 1050 సభ్యత్వం కలిగి ఉన్నది. ఈ మండలం నుండి 3000 మందిని డిసెంబర్ 30న నల్గొండలో జరిగే సభకు జన సమీకరణ చేయనున్నట్లు ఈ సమావేశంలో నిర్ణయించారు. మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, కే వెంకటయ్య, దొడ్డ వెంకటయ్య, రెమిడాల రాజు, తాళ్లూరి రామారావు, దొడ్డ నాగేశ్వరరావు, కస్తూరి సత్యం, అలివేలు, జయసుధ, తదితరులు పాల్గొన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# సర్వే వల్ల సంక్షేమ పథకాలకు ఇబ్బందులు ఉండవు

హుస్నాబాద్ (ప్రభాత సూర్యుడు): హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ కులగణన, సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 87 వేల మంది ఎన్యూమరేటర్లతో ఈ సర్వే కొనసాగుతోందని, సర్వే ప్రక్రియ వల్ల సంక్షేమ పథకాలకు ఎలాంటి కోత పడదని ఆయన స్పష్టం చేశారు. సర్వేలో సేకరించిన సమాచారాన్ని పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, ఆ సమాచారాన్ని మరొకరకంగా ఉపయోగించబడదని ఆయన భరోసా ఇచ్చారు. సర్వే ప్రక్రియ యొక్క ప్రధాన ఉద్దేశ్యం కులాల జనాభా వివరాలను సేకరించడం, అలాగే రాష్ట్రంలో ఉన్న వివిధ అసమానతలను తొలగించడం అని తెలిపారు. ఈ సర్వే 6వ తేదీ నుండి ప్రారంభమై 30వ తేదీ వరకు కొనసాగనున్నది. సర్వేలో 150 నుండి 175 ఇళ్ల వరకు ప్రతి ఎన్యూమరేటరుకు కేటాయించబడ్డాయి. ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వ్యక్తిగత వివరాలను సేకరిస్తున్నారు.

# దీప కాంతుల్లో.. కార్తిక వెన్నెల

**నిండు చంద్రుడు మెండుగా వెలిగే పౌర్ణమి అంటే అందరికీ ఆహ్లాదమే! నెలరాజు.. కార్తిక మాసంలో మరింత సుందరంగా ప్రకాశిస్తాడు. నింగిలో మెరిసే పున్నమి చంద్రుడికి దీటుగా ఇలపై కోటి దీపోత్సవం జరుగుతుంది. పరమేశ్వరుణ్ని జ్యోతి స్వరూపంగా ఆరాధించి.. ఆ స్వామి అనుగ్రహాన్ని పరిపూర్ణంగా పొందుతారు భక్తులు. ఇటువంటి సర్వోన్నతమైన పండుగ రోజు పార్వతీపతిని ఆరాధించేందుకు అత్యంత యోగ్యమైనదని శాస్త్రాలు చెబుతున్నాయి.**

కార్తిక పౌర్ణమికి త్రిపుర పౌర్ణమి అని మరొకపేరు. తారకాసురుడి ముగ్గురు కుమారులూ బ్రహ్మను మెప్పించి, ఎక్కడికైనా స్వేచ్ఛగా సంచరించగలిగే మూడు పురాలను వరంగా పొందారు. ఎవరివల్లా మరణం లేకుండా వరం కోరారు. అది సాధ్యం కాదన్నాడు బ్రహ్మ. అలాగైతే రథం కాని రథం మీద, విల్లు కాని విల్లుతో, నారి కాని నారి సారించి, బాణం కాని బాణం సంధించి, మూడు నగరాలూ ఒకే సరళరేఖలోకి వచ్చాక ఒకే బాణంతో ముగ్గురినీ ఏకకాలంలో కొడితేనే మరణం సంభవించేలా వరం కోరారు. ఇవ్వక తప్పలేదు బ్రహ్మకు. ఆ వర బలంతో పట్టణాలతో సహా సంచారం చేస్తూ లోకాలన్నిటా కల్లోలం సృష్టించారు త్రిపురాసురులు.

వివిధ లోకవాసులు బ్రహ్మకు మొర పెట్టుకున్నారు. వరం ఇచ్చింది తానే కాబట్టి ఏమీ చేయలేనన్నాడు. విష్ణువు దగ్గరికి వెళ్లమని ఉపాయం చెప్పాడు. విష్ణువు కూడా తనకా శక్తిలేదని, వారిని వెంటపెట్టుకుని శివుడి దగ్గరికి వెళ్లాడు. దేవతలందరూ సహకరిస్తేనే తానీపని చేయగలనన్నాడు శివుడు. ఆ మాటతో భూమి రథం కాని రథంగా మారింది. మేరు పర్వతం విల్లుకాని విల్లుగా, ఆదిశేషువు అల్లెతాడు కాని అల్లెతాడుగా, శ్రీమహావిష్ణువు బాణం కాని బాణంగా మారారు. వీరందరి సమాహార శక్తితో శివుడు త్రిపురాసురులను (మూడు పట్టణాల యజమానులైన రాక్షసులను) సంహరించాడని, అందువల్ల ఈ పేరు వచ్చిందనీ పురాణ కథనం.

కార్తిక దీపదానం

'కీటాః పతంగాః మశకాశ్చ వృక్షాః
జలేస్థలే యే నివసంతి జీవాః
దృష్ట్వా ప్రదీపం నీచజన్మ భాగినః
భవంతి త్వం శ్వపచాహి విప్రాః'

ఈ శ్లోకం చదువుతూ కార్తిక పౌర్ణమి నాడు దీపారాధన చేయాలని శాస్త్రం చెబుతున్నది. ఈ రోజు వెలిగించిన దీపపు కాంతిని చూసిన సమస్త జీవులకు శుభం జరగాలని కోరుకోవడమే ఈ శ్లోకం అర్థం. దక్షిణాయనంలో వచ్చే కార్తిక మాసం ఉపాసనకు చాలా యోగ్యమైంది. దీపారాధన చేస్తూ 'దామోదరం ఆవాహయామి' అని గానీ, 'త్రయంబకం ఆవాహయామి' అని గానీ చెబుతూ తమ ఇష్టదైవాలైన శివకేశవులను ఆవాహన చేస్తారు.

'ఏకస్సర్వదానాని దీపదానం తథైకత' అని శాస్త్ర వచనం. అంటే అన్ని దానాలు ఒక ఎత్తు దీపదానం ఒక ఎత్తు అని. దీపదానం చేసేవారు స్వయంగా వత్తులను తయారుచేసుకోవాలని పెద్దలు సూచించారు. వరిపిండి, గోధుమపిండితో ప్రమిదను తయారు చేసి ఆవునెయ్యితో దీపాన్ని వెలిగించాలి. దీపాన్ని పూజించి, నమస్కరించి, శైవ, వైష్ణవాలయాల్లో దానం చేయాలి. ఇలా దీపదానం చేసిన వారికి సద్గతులు ప్రాప్తిస్తాయని విశ్వాసం.

కార్తిక పౌర్ణమి నాడు సాలగ్రామం, ఉసిరికాయలు దానం చేసినా కూడా పాపాలు నశిస్తాయని నమ్మకం. అంతేకాదు ఇదే రోజున ఏడాది మొత్తానికి కలిపి 365 వత్తులతో దీపం వెలిగిస్తారు. దీనిని ఆలయంలో గానీ, ఇంట్లోని పూజగదిలో, తులసి కోట ఎదుట వెలిగించవచ్చు. ఇలా చేయడం వల్ల ముక్కోటి దేవతల అనుగ్రహం కలుగుతుంది. పౌర్ణమి రాత్రి ఆలయ ధ్వజ స్తంభానికి వేలాడే ఆకాశ దీపాన్ని దర్శిస్తే సకల శుభాలూ కలుగుతాయి. కార్తిక మాసంలో ప్రతిరోజూ దీపారాధన చేయలేని వారు కనీసం పౌర్ణమి నాడైనా దీపం వెలిగించాలని పెద్దల మాట. ఈ దీపజ్యోతి ఎవరిపై ప్రసరిస్తుందో వారికి కూడా.. దీపం వెలిగించిన పుణ్యం లభిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. అంతేకాదు, ఇతరులు వెలిగించిన దీపాన్ని ఆరిపోకుండా చూసినవారికి సైతం పుణ్యం దక్కుతుందట.

దీపం అంటే అగ్ని. జ్ఞానానికీ ఆనందానికీ సిరిసంపదలకూ ప్రతీక. దీపకాంతిలో ఉండే ఎరుపు, పసుపు, నీలి కాంతులు ముగురమ్మలకూ సంకేతంగా నిలుస్తాయి. దీపారాధన వల్ల శివుడి అనుగ్రహం సిద్ధిస్తుంది. దీపాలను వెలిగించేవాళ్లకు సహాయకులుగా ఉన్నా, కొడిగట్టబోతున్న దీపానికి నూనె పోసినా కూడా ఆ పుణ్యఫలం దక్కుతుంది. ఈ రోజు కంచుపాత్రలో ఆవునెయ్యి పోసి దీపం వెలిగిస్తే పూర్వజన్మలో చేసిన పాపాలు నశిస్తాయని కార్తిక పురాణం చెబుతున్నది.

కార్తిక పౌర్ణమి నాడు దీపాలు వెలిగించిన వారికి గ్రహ, సర్ప, కాలసర్ప, కళత్ర దోషాలు ఏమైనా ఉంటే అవి తొలగిపోతాయి. అంతేకాదు, దీపారాధనకు దూది వత్తులు వెలిగిస్తే వంశాభివృద్ధి కలుగుతుంది. అరటి, తామర వత్తులను ఉపయోగిస్తే పుత్రశాపం తొలగిపోవడంతోపాటు పాపాలు నశిస్తాయి. తెలుపు గన్నేరు వత్తులను ఉపయోగిస్తే సిరిసంపదలు సమకూరుతాయి.

కార్తిక పౌర్ణమి నాడు దాదాపుగా అందరూ ఉదయం నుంచి ఉపవాసం ఉండి, ప్రదోష కాలంలో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేస్తారు. దీపారాధన ఉసిరి చెట్టు కింద చేస్తే విశేష ఫలం లభిస్తుంది. నైమిశారణ్యంలో కార్తిక పౌర్ణమి నాడు సూత మహర్షి మునులందరితో కలిసి ఉసిరి చెట్టు కింద వనభోజనాలు చేసినట్లు కార్తిక పురాణంలో వర్ణించారు. ఉసిరిచెట్టు శ్రీహరికి అత్యంత ప్రీతిపాత్రమైంది. అందుకే వనభోజనాలకు ఉసిరి చెట్టు నీడ శ్రేష్ఠం. వనభోజనాల ప్రారంభానికి ముందు, ఉసిరి చెట్టు మొదట్లో విష్ణుమూర్తి పటాన్ని లేదా విగ్రహాన్ని ఉంచి, పూజించాలి. ఆ తర్వాత వండిన పదార్థాలను దైవానికి నివేదించి సహపంక్తి భోజనాలు చేయడం సంప్రదాయం.

### అరుణాచలంలో..

కార్తిక మాసంలో తమిళనాడులోని అరుణాచలంలో కొన్ని టన్నుల ఆవునేతిలో, లేదంటే నువ్వులనూనెలో కొన్ని వందల బేళ్ళ పత్తిని, నూలు వస్త్రాలను తడిపి అరుణగిరిపై వెలిగించే దీపానికే కార్తిక జ్యోతి అని పేరు. ఈ జ్యోతి కొన్ని రోజులపాటు వెలుగుతూ గిరి ప్రదక్షిణ చేసేవారికి దారి చూపుతుంది. ఈ కమనీయ దశ్యం చూడటం కోసమే చాలామంది కార్తిక పౌర్ణమికి అరుణాచలంలో గిరిప్రదక్షిణ చేస్తుంటారు.



### కేదారేశ్వర వ్రతం

కార్తిక పౌర్ణమి పర్వదినాన నోము నోచుకునే ఇంట కేదారేశ్వరునికి మర్రి చెట్టు ఊడలను తోరణాలుగా, మర్రిపండ్లను బూరెలుగా, మర్రి ఆకులును విస్తర్లుగా పెట్టి పూజలు చేయడం పురాతనకాలం నుంచి సంప్రదాయంగా వస్తున్నది. కేదారేశ్వర వ్రతం భార్యాభర్తల మధ్య ప్రేమను పెంచుతుంది. ఈ వ్రతంలో 21వ సంఖ్యకు చాలా ప్రాముఖ్యత ఉంది. వ్రతంలో భాగంగా 21 పేటల పట్టు లేక నూలుదారాన్ని తోరంగా ధరించాలి. 21 మంది బ్రాహ్మణులను పూజించిన తర్వాత కలశం/ ప్రతిమలోకి కేదారేశ్వరస్వామిని ఆవాహనం చేయాలి. పూజలో గోధుమపిండితో చేసిన 21 అరిసెలు, పాలు, పెరుగు, నెయ్యి, పాయసంతో పాటు 21 రకాల ఫలాలను, కూరలను నైవేద్యంగా సమర్పించాలి. తేనె తప్పనిసరిగా ఉండాలి.

ఈ వ్రతంలో 21వ సంఖ్యకు ప్రాముఖ్యత ఎందుకంటే శిశువు పుట్టినప్పుడు ఏక వింశతి (21) దోషాలుంటాయి. కేదారుని పూజించడం వల్ల ఈ దోషాలు నశిస్తాయి. మనం సమర్పించే నైవేద్య వస్తువులలో 21 దోషాలకు ఒక్కొక్కటి చొప్పున సమర్పణ చేస్తున్నామన్నమాట. ఈ వ్రతాన్ని ఏకధాటిగా 21 సంవత్సరాల పాటు నిర్వహించి, 21వ సంవత్సరపు పూజాంతంలో ఉద్యాపనం (ముగింపు) చెప్పుకోవాలి. 21 సంఖ్యను పాటించడంలో ఉన్న విశేషం ఇది. ఈ నోము నోచుకున్నవారికి ఐశ్వర్యానికీ, అన్నవస్త్రాలకూ లోటు ఉండదు.

# ట్రాఫిక్‌జామ్ వెనకున్న మతలబేమిటంటే!



బెంగళూరులోని ఎంజీ రోడ్డులో లేదా ఢిల్లీలోని రింగ్ రోడ్డులో మీరెప్పుడైనా ట్రాఫిక్‌జామ్‌లో ఇరుక్కున్నారా? ఒకవేళ ఇరుక్కుపోయి ఉంటే.. ఆ ప్రాంతాల్లో ఎందుకు ట్రాఫిక్‌జామ్ అయిందో మీకు తెలుసా? ఆ మార్గా ల్లో ఎక్కువ కార్లు తిరుగుతుండటమే అందుకు కారణం. ప్రతిఒక్కరూ సొంత వాహనంలో వెళ్తే ఇలాగే ట్రాఫిక్‌జామ్ అవుతుంది కదా! 15 నిమిషాల్లో చేరుకోవాల్సిన గమ్యానికి గంట సేపు ప్రయాణించాల్సి వస్తుంది.

ఒకరు లేదా ఇద్దరు మాత్రమే ప్రయాణించే కారుకు ఎంత జాగ అవసరమవుతుందో ఒక్కసారి ఆలోచించండి. అదే జాగలో పట్టే బస్సు లేదా రైలు బోగీలో ఎంతోమంది ప్రయాణించవచ్చు. సొంత కార్లున్న ప్రతిఒక్కరూ వాటికి బదులు బస్సులను ఆశ్రయించినట్టు ఒక్కసారి ఊహించుకోండి. మన రోడ్లపై ప్రయాణం సాఫీగా సాగుతుంది కదా. ఆ బస్సులు ఎలక్ట్రికలో, హైబ్రిడో లేదా ఇతర హరిత ఇంధనంతో నడిచేవి అయితే, కాలుష్యం కూడా చాలా త్వరగా తగ్గిపోతుంది.

మన దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాలు ఆర్థిక కార్యకలాపాలకే కాదు, అర్బనైజేషన్‌కు కూడా ప్రసిద్ధి. అధిక జనాభా, ట్రాఫిక్‌జామ్, అర్బనైజేషన్ వల్ల కలిగే ఇబ్బందులకు ఈ నగరాలు ప్రతీతి. వీటిని అధిగమించేందుకు వివిధ ప్రతిపాదనలు, కార్యక్రమాలు ఉన్నప్పటికీ ఈ నగరాలు ఎప్పుడూ రద్దీగానే కనిపిస్తాయి. ప్రజా రవాణాను మెరుగుపరచడం, మెట్రో సేవలను మరింతగా విస్తరించడం లాంటి చర్యల ద్వారా కార్ల రద్దీని కొంతమేరకు తగ్గించవచ్చు. వాటికితోడు క్యాబ్‌లు, ఆటో రిక్షాలు ఉండనే ఉన్నాయి. అయినప్పటికీ చాలామంది సొంత వాహనాల్లో వెళ్లేందుకే ఇష్టపడతారు.

రద్దీ ప్రదేశాల్లో కార్లకు అనుమతి నిరాకరించడం, పార్కింగ్ రుసుములను పెంచడం లాంటి చర్యల ద్వారా కార్ల వాడకాన్ని, తద్వారా ట్రాఫిక్‌ను నియంత్రించవచ్చు. కానీ, ప్రభుత్వాలు అలా చేయడం లేదు. అందుకు విరుద్ధంగా కార్ల కొనుగోళ్లను ప్రోత్సహిస్తున్నాయి. ఎందుకంటే, మన దేశంలో జరిగే కార్ల కొనుగోళ్లలో ఈ మూడు నగరాల వాటా చాలా ఎక్కువ. సుమారు 30-35 శాతం కార్లు ఈ నగరాల్లోనే అమ్ముడవుతున్నట్టు ఒక అంచనా. కార్ల వల్ల ట్రాఫిక్, కాలుష్యం లాంటి సమస్యలు ఉన్నప్పటికీ, అవి ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తున్నాయని చెప్పడంలో ఎలాంటి సంశయం అక్కర్లేదు.ఒకవేళ ప్రజా రవాణా మెరుగైతే యథావిధిగా కార్ల కొనుగోళ్లు తగ్గిపోతాయి. ప్రజలు కొత్త కార్లను చాలా తక్కువ సంఖ్యలో కొనుగోలు చేస్తారు. ఇప్పటికే కార్లున్న వారు వాటిని మితంగా వాడతారు. అయితే, ఇది ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. భారతీయ ఆటోమొబైల్ పరిశ్రమ చాలా పెద్దది. దేశ జీడీపీలో ఈ రంగం వాటా సుమారు 7 శాతం. అంతేకాదు, లక్షల మందికి ఈ రంగం ఉపాధి కల్పిస్తున్నది. ఆటోమొబైల్ ఇండస్ట్రీ అంటే ఒక్క కార్లకు సంబంధించినది మాత్రమే కాదు. తయారీదారులు, డీలర్‌షిప్‌లు, సర్వీస్ సెంటర్లు, అనుబంధ పరిశ్రమలు ఇలా అనేకం అందులో భాగం. ఒక్కసారిగా కార్ల కొనుగోళ్లు పడిపోతే.. ఈ మొత్తం చైన్ సిస్టమ్ దెబ్బతింటుంది.

పెట్టుబడులు తగ్గిపోతాయి. అది లేఆఫ్‌లకు దారితీస్తుంది. చివరికి పరిశ్రమలు మూతబడతాయి. ఆటోమొబైల్ రంగం ప్రత్యక్షంగా 20 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నది. అంతేకాదు, దానిపై ఆధారపడి పరోక్షంగా లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. వీరంతా రోడ్డున పడతారు. అంతకుమించి 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యం నీరుగారిపోతుంది.పన్నులు, డ్యూటీలు, ఇతరత్రా రూపంలో ఆటోమొబైల్ రంగం నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు భారీగా ఆదాయం వస్తున్నది. వాహనాలపై జీఎస్టీ, రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజులు, ఇంధనంపై ఎక్సైజ్ డ్యూటీల రూపంలో ఈ ఆదాయం ప్రభుత్వాలకు సమకూరుతున్నది. ఒక్కసారిగా కార్ల కొనుగోళ్లు పడిపోతే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయం గణనీయంగా పడిపోతుంది. అది మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలుపై ప్రభావం చూపుతుంది. అందుకే బస్సు, మెట్రో లాంటి ప్రజా రవాణాను ప్రభుత్వాలు కొంతమేరకే అభివృద్ధి చేస్తాయే తప్ప, మనం కార్లు కొనడం మానేసేంత గొప్పగా మెరుగుపరచవు.



# మూసీ ప్రక్షాళనపై డీకే అరుణ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు): బీజేపీ మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు వ్యతిరేకంగా ఏం మాట్లాడలేదని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. తాజాగా ఆమె మాట్లాడుతూ, మూసీ ప్రక్షాళనపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. మూసీ నీటిని శుద్ధి చేసి మంచి నీటిగా మార్చాలని తమకు వ్యతిరేకం లేదు అని ఆమె స్పష్టం చేశారు. అయితే, మూసీ ప్రక్షాళన పేరుతో లక్షల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టే ప్రణాళికను మాత్రమే బీజేపీ వ్యతిరేకిస్తోందని ఆమె చెప్పారు. పేదవారి ఇళ్ళను కూలగొట్టి, వారికి నిరాశ్రయులుగా చేయాలని జరిగిన చర్యను బీజేపీ కట్టుదిట్టంగా వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. ప్రక్షాళనకు అవసరమైన రీటైనింగ్ వాల్‌లు వేయడం ద్వారా, మూసీ నదిని శుద్ధి చేయవచ్చని ఆమె చెప్పారు. దీనికి కూడా లక్షల కోట్లు ఖర్చు పెట్టే అవసరం లేదని అన్నారు. ఆమె ప్రశ్నిస్తూ, "ఎందుకు డీపీఆర్ లేకుండా ఇళ్ళను ముందే కూలగొడుతున్నారు?" అని నిలదీశారు. కాంగ్రెస్ నేతలు, "డీపీఆర్ లేకుండా లక్షన్నర కోట్ల ఖర్చు?" అని అంటున్నారని ఆమె అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టులో దోచుకున్నట్లు, మూసీ ప్రక్షాళన పేరుతో కూడా లక్షల కోట్ల రూపాయలను దోచుకోవడానికి కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ లక్షల కోట్ల రూపాయల దోపిడీని బీజేపీ గట్టి విధంగా వ్యతిరేకిస్తుందని డీకే అరుణ చెప్పారు.

Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad - 500 013 Telangana.
Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505,
Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215